
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 1 । మార్చి । 2024



సోమశిలలో 16.764 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారానికి 16.764 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 1,900, ఉత్తర, దక్షిణ కాలువలకు 1,150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,220
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,767
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,940
నవర (8 గ్రాములు)	రూ.47,520

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.5 /24.2

గురువారం గాలిలో తేమ 60 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. శుక్రవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

జాబ్‌మేళాలో 128 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన యువత

నెల్లూరు(టౌన్‌): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో గురువారం జేకేసీ, జిల్లా నైపుణ్య కల్పనా సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహించారు. ఈ ఉద్యోగమేళాలో జిల్లా నుంచి 261 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, వారిలో 128 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ ఉద్యోగమేళాలో చెన్నై, శ్రీసిటి నుంచి 11 కంపెనీలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్‌ వెంకటేశ్వర్లు, మెంటర్‌ ఏడుకొండలు, ఏపీఎస్‌ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్‌ అధికారి జనార్దన్‌ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరి డిబార్‌

వెంకటాచలం: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ ఒకటో సెమిస్టర్‌ పరీక్షల్లో ఒక విద్యార్థి డిబార్‌ అయ్యారని ఆ విశ్వవిద్యాలయం పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్‌ ఆర్‌.మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 7,798 మంది విద్యార్థులకుగాను, 7,198 మంది పరీక్షలకు హాజరయ్యారని, 600 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్‌ అయ్యారని తెలిపారు.

3.19 లక్షల మందికి వైఎస్సార్‌ పింఛన్‌ కానుక

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్‌ పింఛన్‌ కానుక నగదు పంపిణీకి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. వలంటీర్లు శుక్రవారం ఉదయం నుంచి పింఛన్‌ కానుక నగదు పంపిణీ చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 3,19,961 మంది లబ్ధిదారులకు రూ.95.77 కోట్ల నగదు పంపిణీ చేయనున్నారు. 3,17,717 ఓఏపీ, వితంతు, దివ్యాంగ తదితర రకాల పింఛన్లు, 2244 ఏఆర్‌టీ పింఛన్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది.

నేడు జగనన్న విద్యాదీవెన నిధుల విడుదల

నెల్లూరు(దర్గామిట్ట): 2023–24 విద్యా సంవత్సరంలో మొదటి త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యాదీవెన నిధులను శుక్రవారం సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయనున్నారని ఎస్సీ సంక్షేమ, సాధికారిత జిల్లా అధికారి కె.రమేష్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 46,648 మంది విద్యార్థులకు రూ.35.73 కోట్లు వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. జగనన్న విద్యాదీవెన నిధుల విడుదలకు సంబంధించి ముఖ్యమంత్రి కార్యక్రమం అనంతరం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో మంత్రి, కలెక్టర్‌ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

ఆర్బీకేల ద్వారా శనగ పంట కొనుగోలు

- ఇన్‌చార్జి జేసీ వికాస్‌మర్మత్‌



మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ వికాస్‌మర్మత్‌

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో రబీ సీజన్‌ 2023–24లో రైతులు పండించిన శనగ పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా మార్క్‌ఫెడ్‌ వారు కొనుగోలు చేయనున్నట్లు ఇన్‌చార్జి జాయింట్‌ కలెక్టర్‌ వికాస్‌మర్మత్‌ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో రబీ సీజన్‌లో రైతులు 14,858 ఎకరాల్లో శనగపంటను సాగు చేశారన్నారు. రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఈ–క్రాప్‌ ద్వారా నమోదు చేసుకోవాలని, ఈ–క్రాప్‌లో నమోదైన రైతుల వద్ద నుంచి శనగపంటను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సమీప వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. పంట దిగుబడిలో 14 శాతం కన్నా తక్కువ తేమ ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. కేటాయించిన షెడ్యూల్‌ తేదీల్లో శనగపంటను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన పంట ఉత్పత్తిని మార్క్‌ఫెడ్‌ వారు అందజేసే కొత్త గోనె సంచుల్లో నింపుకోవాలన్నారు. నాణ్యమైన శనగపంటకు క్వింటాల్‌కు రూ.5,440 కనీస మద్దతు ధరగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. నగదు బ్యాంకుల్లో జమయ్యేలా సంబంధిత బ్యాంకు ఖాతాలకు ఆధార్‌ అనుసంధానం, ఖాతా వాడుకలో ఉండేలా రైతులు చూసుకోవాలన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే 0861–2327160, 8978381839, 8985084988, 6309009805 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఇక ఈ భూములు మావే

- దశాబ్దాల నాటి దళితుల భూసమస్యలకు చెల్లుచీటీ
- పరిష్కారం చూపిన వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం
- ఎస్సీ కార్పొరేషన్‌ ద్వారా 1991లో ఎస్సీలకు భూముల కేటాయింపు
- 2008లో కార్పొరేషన్‌ రుణాలను రద్దు చేసిన అప్పటి సీఎం వైఎస్సార్‌
- ఆ భూములకు శాశ్వత హక్కు, రిజిస్ట్రేషన్‌ సౌకర్యం కల్పించిన సీఎం వైఎస్‌ జగన్‌

గతంలో భూమి లేని దళితుల కోసం భూములు కొనుగోలు చేసి ఎస్సీ కార్పొరేషన్‌ ద్వారా అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసింది. అయితే లబ్ధిదారులు ఆ భూములను సాగు చేసుకోవడం తప్ప వాటిపై ఎలాంటి హక్కులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి దళితులకు ఆ భూములపై శాశ్వత హక్కులు కల్పించేలా చర్యలు తీసుకున్నారు. ఆ భూములకు రిజిస్ట్రేషన్‌ అవకాశాన్ని కూడా కల్పించారు.



దళితులకు భూ హక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి (ఫైల్‌)

కందుకూరు: దళితుల భూములకు సంబంధించి దశాబ్దాల నాటి సమస్యకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత పరిష్కారం చూపారు. గతంలో ప్రభుత్వాలు దళితులకు భూములు కేటాయించినా వాటిపై శాశ్వత హక్కు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం వారి పాలిట వరంలా మారింది. దశాబ్దాల తరబడి తమ ఆధీనంలో ఉన్నా సరైన హక్కులు లేక ఇబ్బందులు పడుతున్న క్రమంలో లబ్ధిదారులైన దళితులకు ఆ భూములపై శాశ్వత హక్కు, రిజిస్ట్రేషన్‌ అవకాశం కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం వారిని భూ యజమానులుగా మార్చనుంది.

ఎస్సీ కార్పొరేషన్‌ ద్వారా భూములు

భూమి లేని నిరుపేద దళితులను గుర్తించి వారికి ప్రభుత్వం భూములు కొనుగోలు చేసి ఇచ్చే కార్యక్రమానికి 1991లో అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఎస్సీ కార్పొరేషన్‌ ద్వారా భూములను కొనుగోలు చేసి దళితులకు పంపిణీ చేసింది. భూమి అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఒక కుటుంబానికి ఒక ఎకరం చొప్పున, భూమి తక్కువగా అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో అర ఎకరం చొప్పున భూములు కొనుగోలు చేసి లబ్ధిదారులకు ఇచ్చారు. ఈ విధంగా జిల్లాలో 1,447 మంది దళిత లబ్ధిదారులకు 972.47 ఎకరాల భూములను అప్పట్లో ప్రభుత్వం అందించింది. ఇలా కందుకూరు ప్రాంతంలో అయితే ఆదిఆంధ్రా కాలనీ, ప్రకాశం కాలనీ, దూబగుంట, కొల్లగుంట, కాకిబంగారుపాళెం, ఆనందపురం, ఓగూరు తదితర ప్రాంతాల్లోని దళితులకు భూములను కేటాయించింది. దీనిలో ప్రభుత్వం కొంత మొత్తాన్ని భరించగా, యూనిట్‌ ఖరీదు కింద ఎస్సీ కార్పొరేషన్‌ ద్వారా రూ.14 వేల చొప్పున రుణాలను మంజూరు చేశారు. ఈ రుణాలు పూర్తిగా చెల్లించిన తరువాత ఆ భూములను దళితులకు అప్పగించే ఏర్పాటు చేశారు. అప్పటి వరకు భూములకు సంబంధించి పత్రాలను ఎస్సీ కార్పొరేషన్‌ వద్ద భద్రపరిచారు.

రుణాలను రద్దు చేస్తూ వైఎస్సార్‌ నిర్ణయం

దళితులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖరరెడ్డి 2008లో చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఎస్సీ కార్పొరేషన్‌లో దళితుల పేరిట ఉన్న రూ.లక్ష లోపు రుణాలను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వ్యాపారం, చేతివృత్తుల కోసం తీసుకున్న రుణాలను రద్దు చేశారు. దీంతో దళితుల భూములపై ఉన్న రుణాలు కూడా పూర్తిగా మాఫీ అయ్యాయి. దీని వల్ల ఎస్సీ కార్పొరేషన్‌ ద్వారా పొందిన భూములు పూర్తిగా దళితులకు దక్కే అవకాశం ఏర్పడింది. తిరిగి 2012వ సంవత్సరం నుంచి ఈ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్‌ సౌకర్యం కల్పించి సంపూర్ణ హక్కులు ఇవ్వాలని దళితులు ప్రభుత్వానికి అనేకమార్లు విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. కానీ ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు.

శాశ్వత హక్కులు కల్పిస్తూ జగనన్న నిర్ణయం

ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2021 నుంచి తమ భూములకు రిజిస్ట్రేషన్‌ సౌకర్యం కల్పించాలని కోరుతూ దళితులు మరోసారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అన్ని అంశాలను పరిశీలించిన తరువాత 2023లో ఎస్సీ కార్పొరేషన్‌ భూములను పూర్తిగా దళితులకు అప్పగిస్తూ, రిజిస్ట్రేషన్‌ సౌకర్యాన్ని కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇటీవల ఎస్సీ కార్పొరేషన్‌ అధికారులు తమ వద్ద ఉన్న భూములకు సంబంధించిన పత్రాలన్నింటినీ దళితులకు అప్పగించారు. ఇకపై ఎస్సీ కార్పొరేషన్‌ ద్వారా పొందిన భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్‌ హక్కులు కల్పించడంతో పాటు లబ్ధిదారులు తమ అవసరాలకు ఆ భూములను విక్రయించుకునే వెసులుబాటును కల్పిస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయం చాలా సంతోషకరం



ఎస్సీ కార్పొరేషన్‌ ద్వారా దళితులకు ఇచ్చిన భూములకు ఇన్నేళ్ల తరువాత హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. తద్వారా ఆ భూములపై శాశ్వత హక్కులు లభిస్తున్నాయి. తద్వారా కందుకూరులో భూముల విలువ భారీ పెరిగింది. ప్రస్తుతం ఎకరం రూ.70 లక్షల వరకు ధర పలుకుతోంది. మేమంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నాం.

– రేణమాల అయ్యన్న, ఆదిఆంధ్రా కాలనీ, కందుకూరు

ఈ మేలును మరువలేం



అప్పట్లో నాకు ఎస్సీ కార్పొరేషన్‌ ద్వారా ఒక ఎకరం భూమి ఇచ్చారు. కానీ అప్పటి నుంచి భూమి మా ఆధీనంలో ఉన్నా మాకు ఎలాంటి హక్కు లేదు. అధికారుల వద్దే మా భూములకు సంబంధించి పత్రాలు ఉన్నాయి. ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భూముల పత్రాలు మాకు ఇచ్చి, రిజిస్ట్రేషన్‌ చేసుకునే అవకాశం కల్పించారు. ఈ మేలును మరువలేం.

– చినకొండయ్య, ఆదిఆంధ్రా కాలనీ, కందుకూరు

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



ఎన్నో ఏళ్ల నుంచి ప్రభుత్వం ద్వారా ఇచ్చిన భూములు సాగు చేసుకుంటున్నాం. అయినా మాకు అమ్ముకునే హక్కు గానీ, మా పిల్లల పేరుపై రాసే హక్కు గానీ లేదు. ఇప్పుడు ఆ భూములకు సంబంధించిన అన్ని పత్రాలను మాకు ఇచ్చారు. శాశ్వత హక్కులు కల్పించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– జంగిలి సుశీలమ్మ, ఆదిఆంధ్రా కాలనీ, కందుకూరు

‘రైతుభరోసా’ చారిత్రాత్మకం

- కర్షకులను దోచుకున్నది టీడీపీనే
- రుణమాఫీ చేస్తామని ఎగ్గొట్టింది చంద్రబాబే
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతల కోసం రైతుభరోసా కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడం చారిత్రాత్మకమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి కాకాణి మాట్లాడారు. గడచిన ఐదేళ్లలో విత్తనం నుంచి పంట విక్రయం వరకు అన్నివిధాలుగా రైతాంగానికి మేలు చేశామన్నారు. ప్రతి పథకాన్ని పేద రైతు కుటుంబాలకు అందుబాటులోకి తెచ్చి సంక్షేమ ఫలాలను అందించామని తెలిపారు. వ్యవసాయాన్ని పండగ చేసిన ప్రభుత్వం తమదేనని గర్వంగా చెబుతున్నామన్నారు. గతంలో వ్యవసాయం దండగని, ప్రాజెక్టులకు రూ.వేల కోట్లు ఖర్చు ఎందుకని, వాటి వలన ఎలాంటి ఉపయోగం లేదని చెప్పిన ఘనుడు చంద్రబాబు అని గుర్తుచేశారు. ఇచ్చిన హామీ కన్నా మిన్నగా వైఎస్సార్‌ రైతుభరోసా ద్వారా ఏటా రూ.12,500 బదులు రూ.13,500 చొప్పున ఐదేళ్లల్లో ప్రతి రైతు కుటుంబానికి రూ.67,500 చొప్పున వారి ఖాతాలో జమ చేసి లబ్ధి చేకూర్చామని తెలిపారు. ప్రతి రైతన్నకు పెట్టుబడి సాయంగా డబ్బులు ఇవ్వడమే కాకుండా సున్నా వడ్డీని వర్తింపచేస్తూ రూ.లక్ష వరకు పంట రుణాలు అందిస్తున్న కార్యక్రమాన్ని కూడా చేపడుతున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు సంబంధించి బాబు ఎగ్గొట్టిన బ్యాంకు రుణాలను కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లించిందన్నారు. గ్రామస్థాయిలో ఆర్బీకే వ్యవస్థను తీసుకొచ్చి రైతులకు సేవలందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో కనీస మద్దతు ధర కన్నా తక్కువగా పుట్టి రూ.12,800 చొప్పున ధాన్యాన్ని విక్రయిస్తే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అధిక ధరలకు విక్రయించుకునేలా చర్యలు చేసుకున్నామని తెలిపారు.

రైతులను మోసం చేసిన బాబు

2014 ఎన్నికల్లో రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబు కోటయ్య కమిటీ వేయించారని, ఆ కమిటీ సిఫార్సులను కూడా అమలు చేయలేదని మంత్రి దుయ్యబట్టారు. రైతులను నట్టేట ముంచారని గుర్తుచేశారు. బ్యాంకులకు చెల్లించాల్సిన రూ.87,612 కోట్ల సున్నా వడ్డీని కూడా చంద్రబాబు ఎగ్గొట్టారని, మరోవైపు నీరు–చెట్టు పథకం పేరుతో టీడీపీ నేతలు రూ.50 వేల కోట్లు దోచుకుని రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారని తెలిపారు. అన్ని విధాలుగా రైతులను మోసం చేసిన ఘనత చంద్రబాబుదేనని, ఆయన హయాంలో కరువు కాటకాలు విలయతాండవం చేశాయని గుర్తుచేశారు. ఈ ఐదేళ్లలో ఒక్క వైఎస్సార్‌ రైతుభరోసా పీఎం కిసాన్‌ పథకం ద్వారానే రూ.34,288 కోట్లు రైతన్నలకు అందజేశామని తెలిపారు.

నేటి నుంచి ఇంటర్‌ పరీక్షలు

- నేడు ప్రథమ, రేపు ద్వితీయ సంవత్సరాల పరీక్షలు ప్రారంభం
- జిల్లావ్యాప్తంగా 81 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 52,076 మంది విద్యార్థులు
- పబ్లిక్‌ డొమైన్‌లో హాల్‌టికెట్లు
- హాల్‌ టికెట్‌పై ప్రిన్సిపల్‌ సంతకం లేకున్నా పరీక్షకు అనుమతి
- ఫిర్యాదుల కోసం కంట్రోల్‌ రూం ఏర్పాటు

నెల్లూరు(టౌన్‌): ఇంటర్మీడియట్‌ పబ్లిక్‌ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఇంటర్‌ మొదటి సంవత్సరం, శనివారం నుంచి ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి. ఈ నెల 20వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 81 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఇంటర్‌ విద్యార్థుల హాల్‌ టికెట్లు అధికారులు పబ్లిక్‌ డొమైన్‌లో ఉంచారు. http://bieap.apcfss.in వెబ్‌సైట్‌ ద్వారా ఇంటర్‌ ప్రథమ సంవత్సర విద్యార్థులు పుట్టిన తేదీ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు ప్రథమ సంవత్సరం హాల్‌టికెట్‌ నంబర్‌, పుట్టినతేదీని సబ్మిట్‌ చేసి డౌన్‌ చేసుకోవాల్సి ఉంది. హాల్‌టికెట్‌పై సంబంధిత కళాశాల ప్రిన్సిపల్‌ సంతకం లేకుండా పరీక్షలకు అనుమతిస్తామని ఆర్‌ఐఓ ఎ.శ్రీనివాసులు తెలిపారు. విద్యార్థులు ఫిర్యాదుల కోసం కంట్రోలు రూం నంబర్‌ 0861–2320312కు ఫోన్‌ చేయవచ్చని తెలిపారు.

52,076 మంది విద్యార్థుల హాజరు

ఇంటర్‌ పబ్లిక్‌ పరీక్షలకు ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 52,076 మంది హాజరుకానున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరానికి సంబంధించి జనరల్‌ 25,202, ఒకేషనల్‌ 1,217 కలిపి మొత్తం 26,419 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి జనరల్‌ 24,243, ఒకేషనల్‌ 1,414 కలిపి మొత్తం 25,657 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. విద్యార్థులను ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నట్లు ఇంటర్‌బోర్డు అధికారులు తెలిపారు. జిల్లాలో 7 సమస్యాత్మక కేంద్రాలైన చేజర్ల, కుల్లూరు, రాపూరు, మర్రిపాడు, ఆత్మకూరు, బిట్రగుంట, ఉదయగిరి సెంటర్లలో పరీక్షలను అధికారులు పకడ్బందీగా నిర్వహించనున్నారు. ఇందుకోసం 5 ఫ్లయింగ్‌ స్క్వాడ్‌లు, 5 సిటింగ్‌ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. వీరితోపాటు 81 మంది చీఫ్‌ సూపరింటెండెంట్లు, 81 మంది డిపార్ట్‌మెంట్‌ అధికారులను నియమించారు. వీరితోపాటు డీఈసీ కమిటీని ఏర్పాటు చేశారు. ఆర్‌ఐఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటర్‌ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎవరికైనా ఇబ్బందులు ఉంటే కంట్రోలు రూంకు ఫోన్‌ చేస్తే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

అందరం కలిసికట్టుగా పనిచేద్దాం

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌
- సమన్వయకర్త ప్రకటన తరువాత మొదటిసారి కందుకూరు వచ్చిన బుర్రా
- ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డితో భేటీ



బుర్రాకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

కందుకూరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని ఆ పార్టీ కందుకూరు నియోజకవర్గ నూతన సమన్వయకర్త ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌ పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ నూతన సమన్వయకర్తగా నియమితులైన ఆయనకు కందుకూరులో గురువారం ఘనస్వాగతం లభించింది. రెండ్రోజుల క్రితం కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను కందుకూరు సమన్వయకర్తగా పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు గురువారం ఆయన నియోజకవర్గ కేంద్రమైన కందుకూరు పట్టణానికి విచ్చేశారు. తొలుత గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

ముఖ్యమంత్రి ఆశీస్సులతోనే..

సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతోనే కందుకూరు సమన్వయకర్తగా వచ్చానని, వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు ఆధ్వర్యంలోనే తాను పనిచేస్తానని తెలిపారు. గతంలో కందుకూరులో పార్టీ సమన్వయకర్తగా దాదాపు రెండు సంవత్సరాలపాటు పనిచేశానని గుర్తుచేశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి ఏంటో తనకు తెలుసునని, అలాగే ప్రతి కార్యకర్త తనకు గుర్తున్నారని వివరించారు. కందుకూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను మరోసారి ఎగురవేసేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.

పార్టీ ఆదేశాలతో..

స్థానిక ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డితో బుర్రా మధుసూదన్‌యాదవ్‌ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లిన బుర్రా దాదాపు గంటపాటు మహీధర్‌రెడ్డితో చర్చించారు. పార్టీ ఆదేశాల ప్రకారం తాను కందుకూరుకు వచ్చానని, తనకు సహాయ సహకారాలు అందించాలని మహీధర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్‌ రఫీ, జేసీఎస్‌ కోఆర్డినేటర్‌ ముప్పవరపు కిశోర్‌, గణేశం గంగిరెడ్డి, చనమాల శ్రీధర్‌, రేణమాల అయ్యన్న, వెంకట్రామిరెడ్డి, పల్నాటి చెన్నయ్య, వాకా రాజారెడ్డి, రహీం, వల్లూరి కోటేశ్వరరావు, మస్తాన్‌వలి, రాఘవరెడ్డి, నాగసూరి శ్రీను, అప్పబోయిన రాజేష్‌, జాజుల బ్రహ్మయ్య, ఎలికా వెంకట్రావు, దబ్బుకొట్టు మల్లికార్జున, తల్లపనేని గోపి, థామస్‌, మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలి

- కలెక్టర్‌ ఎం.హరినారాయణన్‌



మాట్లాడుతున్న కలెక్టర్‌ ఎం.హరినారాయణన్‌

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల నిర్వహణకు నియమించిన నోడల్‌ అధికారులు ఇకపై ఎన్నికల విధులపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని కలెక్టర్‌ ఎం.హరినారాయణన్‌ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఎన్నికల నోడల్‌ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ నోడల్‌ అధికారులు చేయాల్సిన పనులకు సంబంధించి చెక్‌లిస్ట్‌ తయారు చేసుకుని ఆ ప్రకారం పనిచేయాలన్నారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించడానికి సోమవారం నుంచి నగరపాలక సంస్థ కార్యాలయంలో 24/7 కంట్రోల్‌ రూం ఏర్పాటు చేస్తున్నామని, అందుకు అనుగుణంగా ప్రతి నోడల్‌ అధికారికి సంబంధించి మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించుకోవాలని తెలిపారు. జిల్లాలోని 8 నియోజకవర్గాలకు సంబంధించిన సమాచారం, సమస్యలు, కంట్రోల్‌ రూంకు తెలియజేస్తారని, సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎస్‌.లవన్న, నోడల్‌ అధికారులు బాపిరెడ్డి, సుస్మితారెడ్డి, కన్నమనాయుడు, పద్మావతి, సురేష్‌, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎన్నికల టీం అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల నిబంధనలు అర్థం చేసుకుని ఎన్నికల విధుల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో కలెక్టరేట్‌ ఏఓ శర్మ, ఎలక్షన్‌ తహసీల్దార్‌ సుబ్రహ్మణ్యం, పలువురు తహసీల్దార్లు, డీటీలు, సీనియర్‌ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూలో అధ్యాపకులకు శిక్షణ

నెల్లూరు(టౌన్‌): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో గురువారం నోడల్‌ రిసోర్స్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో బోటని, మైక్రో బయాలజీ సబ్జెక్టులపై అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమాన్ని కళాశాల విద్యా కమిషనర్‌ పోలా భాస్కర్‌ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్‌ గిరి, వైస్‌ ప్రిన్సిపల్‌ రమణారావు మాట్లాడారు. రిసోర్స్‌ పర్సన్లు మంజునాథ్‌రెడ్డి, రాజశేఖర్‌, కన్యాకుమారి పాల్గొన్నారు.

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో రెండు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్‌ ఇంజినీర్లు గురువారం తెలిపారు. ఇందులో భాగంగా 1వ యూనిట్‌లో 400 మెగావాట్లు, 2వ యూనిట్‌లో 490 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల 3వ యూనిట్‌లో ఉత్పత్తి నిలిపివేశామని తెలిపారు.

క్లుప్తంగా

మోటార్‌బైక్‌ను ఢీకొన్న కారు

• ఇరిగేషన్ శాఖ ఉద్యోగి మృతి



చాంద్‌బాషా మృతదేహం

వెంకటాచలం: మోటార్‌బైక్‌ను కారు ఢీకొనడంతో ఇరిగేషన్ శాఖకు చెందిన ఉద్యోగి మృతి చెందిన ఘటన వెంకటాచలం టోల్‌ప్లాజా సమీపంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చవటపాళెం పంచాయతీ ఎర్రగుంట గ్రామానికి చెందిన షేక్ చాంద్‌బాషా (43) వెంకటాచలం ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో లస్కర్‌గా పని చేస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. పని నిమిత్తం బైక్‌పై అనికేపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా టోల్‌ప్లాజా సమీపంలో వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో చాంద్‌బాషా తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా రోదించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కారును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీఎస్‌యూలో విద్యార్థులకు అవగాహన

• వీసీ జీఎం సుందరవల్లి



మాట్లాడుతున్న వీసీ సుందరవల్లి

వెంకటాచలం: యువ సంవాద్ ఇండియా 2047లో భాగంగా మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో గురువారం పంచ్‌ప్రాణ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో వీసీ సుందరవల్లి మాట్లాడుతూ యువత ఆలోచన విధానాల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే ఆశయంతో కేంద్ర ప్రభుత్వం యువ సంవాద్ ఇండియా 2047 అనే నినాదాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. భారతదేశ చరిత్ర ఎంతో గొప్పదని, ప్రముఖుల జీవిత చరిత్రలను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులు, విధులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రోగ్రాం ఆర్గీ డాక్టర్ ఎ.మహేంద్రరెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం అధికారి డాక్టర్ కె.విద్యాప్రభాకర్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ సదస్సు



సదస్సుకు హాజరైన ప్రముఖులు

వెంకటాచలం: మహాభారతం – భారతీయ దార్శనికత అనే అంశంపై మండలంలోని సరస్వతి నగర్ వద్దనున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో మూడురోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు గురువారం ముగిసింది. పలువురు ప్రముఖ కవులు హాజరై మహాభారతం గురించి యువత తెలుసుకోవాలని సూచించారు. సదస్సులో అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్, ఉస్మానియా విశ్వవిద్యాలయ పూర్వపు ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి, వి.చంద్రశేఖర్ రెడ్డి, బూదాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 145
లేయర్ (లైవ్)	: 70
బ్రాయిలర్ చికెన్	: 250
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 280
లేయర్ చికెన్	: 120

నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.22

'చంద్రబాబుపై ప్రజలకు నమ్మకం లేదు'

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
• సంక్షేమ ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు
• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సోమశిల: 'చంద్రబాబు నాయుడిపై ప్రజలకు నమ్మకం లేదు. వచ్చే ఎన్నికల్లో ఆయన గెలుపునకు గ్యారెంటీ లేదు' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. అనంతసాగరం మండలంలోని ఉప్పలపాడులో గురువారం ఆయన ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన మంత్రి, ఎమ్మెల్యేకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ ఊరిబిండి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రుణమాఫీ పేరుతో పొదుపు మహిళలను చంద్రబాబు మోసం చేశారన్నారు. 600కు పైగా హామీలిచ్చి పట్టించుకోలేదన్నారు. హామీలను ఆయన మరిచిపోయినా ప్రజలందరూ గుర్తుపెట్టుకుని 2019 ఎన్నికల్లో టీడీపీని 23 అసెంబ్లీ సీట్లకే పరిమితం చేశారన్నారు. గత ప్రభుత్వంలో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వ్యవసాయానికి సాయం అందక అప్పుల ఊబిలో కూరుకుపోయారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే రైతులకు అండగా నిలిచారన్నారు. ఆర్బీకేలు ప్రారంభించారన్నారు. అన్నదాతల కోసం అనేక పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. అలాంటి ముఖ్యమంత్రికి ప్రజలంతా మళ్లీ అండగా నిలవాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు.

జగన్ వెంటే..

సంక్షేమ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని విక్రమ్‌రెడ్డి కోరారు. సభలో ఆయన మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలను తెచ్చిందన్నారు. ముఖ్యమంత్రి జగనన్న వెంట ప్రజలంతా మళ్లీ నడిచేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మండలంలోని రెవెన్యూ సమస్యల గురించి ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకురావడంతో కలెక్టర్‌తో చర్చించానన్నారు. సీఎం తెచ్చిన సంస్కరణలతో 78 మంది రైతుల సమస్యలను పరిష్కరించగలిగామని వివరించారు. ఉప్పలపాడులో సంక్షేమాభివృద్ధి కోసం రూ.8 కోట్లకు పైగా నిధులు అందజేయడం జరిగిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.20 లక్షలతోపాటు ఎంపీ నిధులు రూ.10 లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అనంతసాగరం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు అనిల్ కుమార్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాజావలీ తదితరులు పాల్గొన్నారు.

రూరల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



అభివృద్ధి పనులను ప్రారంభించిన ఆదాల, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

• నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్ పరిధిలోని 41వ డివిజన్‌లో రూ.1.99 కోట్లతో చేసిన అభివృద్ధి పనులను గురువారం ఆదాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది నెలల కాలంలోనే రూ.150 కోట్లతో వివిధ పనులు చేపట్టామని గుర్తుచేశారు. కొన్ని పత్రికలు వాస్తవాలు రాయడం లేదన్నారు. ప్రభుత్వంపై ఎక్కడా వ్యతిరేకత లేదన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తనంటే గిట్టని వాళ్లు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, ప్రజలు నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయలక్ష్మి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మేయర్ స్రవంతి, నాయకులు ఏలూరు గోపీప్రసాద్, వెంకటేశ్వర్లు, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల కోసం 'స్నేహ హస్తం'

బిట్రగుంట: బిట్రగుంట రైల్వేస్టేషన్ 'క్రూ లాబీ'లో కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కరించే దిశగా విజయవాడ రైల్వే డివిజన్ పర్సనల్ విభాగం ఆధ్వర్యంలో 'స్నేహ హస్తం' పేరుతో గ్రీవెన్స్ అదాలత్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. విజయవాడ రైల్వే డివిజన్ సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్ ఈ కార్యక్రమంలో పాల్గొని రైల్వే కార్మికుల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైల్వే కార్మికుల సమస్యలను సకాలంలో పరిష్కరించేలా ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రైల్వే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు.

సీఎం వైఎస్ జగన్ వెంటే జనం

• పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన
• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



బోగోలులో ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

బిట్రగుంట: 'రాష్ట్ర ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయం' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బోగోలు పంచాయతీ పరిధిలో కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఎమ్మెల్యే గురువారం ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పాలన కొనసాగాలన్నా, పేదల బతుకుల్లో మరింత భరోసా నిండాలన్నా రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీనే గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా పేదల పక్షాన నిలబడి సంక్షేమ పథకాల ద్వారా భరోసా కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ పాలనను నేరుగా ప్రజల ముంగిటకే చేర్చారని వివరించారు. పింఛన్ల నుంచి పథకాల వరకూ వలంటీర్లు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి ఇవ్వడం మన రాష్ట్రంలో తప్ప మరెక్కడా లేదని తెలిపారు. ప్రజా బలంతో త్వరలో జరగనున్న ఎన్నికలు ఏకపక్షమేనని, ఈదఫా కూడా వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాలతో చరిత్ర సృష్టించడం ఖాయమన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు మాట్లాడుతూ రౌడీ రాజకీయాలతో ప్రశాంతతకు భంగం కలిగించి వివాదాలు సృష్టించే నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. రామిరెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు సుంకే మాల్యాద్రి, మండల యువత అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు, సీనియర్ నాయకులు పత్రి అంకులయ్య, తుమ్మల రమణయ్య, సర్పంచ్‌లు పందిపాటి అనిత, ఉప్పాల మాచర్ల, రేగలగడ్డ రామారావు, ఎంపీటీసీ సభ్యులు ఏకే సుందర్ రాజు, మల్లి మోహన్, మందా కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం



మహిళతో మాట్లాడుతున్న ఖలీల్ అహ్మద్, చిత్రంలో నాయకులు

• వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రజలందరికీ అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ సమన్వయకర్త ఎండీ ఖలీల్ అహ్మద్ తెలిపారు. నగరంలోని 51వ డివిజన్ కపాడిపాళెం, 10వ డివిజన్ రామచంద్రాపురం, రామ్‌నగర్, ఉస్మాన్‌సాహెబ్‌పేట తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే అనిల్ కుమార్ చేసిన అభివృద్ధితో ప్రజలకు వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటామని ప్రజలు చెబుతుండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సాహిత్య, కిన్నెర ప్రేమ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి అండగా నిలవండి

• ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి



మహిళకు పట్టా అందజేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి): సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లోనూ అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రజలను కోరారు. నియోజకవర్గంలోని ఇళ్ల స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ పట్టాలను వింజమూరులోని ఎస్వీ కన్వెన్షన్ హాల్లో గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు ఏ ప్రభుత్వం కూడా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. ఒక్క వైఎస్ జగన్ మాత్రమే నెరవేర్చినట్లు తెలిపారు. చంద్రబాబుకు, జగన్‌కు మధ్య ఉన్న తేడాను గమనించాలని కోరారు. ప్రలోభపెట్టి ఓట్లు వేయించుకునేందుకు టీడీపీ నేతలు కుయుక్తులు పన్నుతున్నారని, వారి వలలో చిక్కుకోవద్దని ప్రజలకు సూచించారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి మేకపాటి కుటుంబం 40 ఏళ్ల నుంచి నిరంతరం కృషి చేస్తోందన్నారు. విదేశాలకు చెందిన వ్యక్తిని టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిందన్నారు. ఇంతవరకు ప్రజల ముఖం చూడని అతడికి మద్దతు ఇస్తే నియోజకవర్గ అభివృద్ధి ఆగిపోతుందన్నారు. మంచి, చెడు ఆలోచించి వచ్చే ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని కోరారు. ఆత్మకూరు ఆర్డీఓ మధులత మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పలువురు వక్తలు ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య, సర్పంచ్ ఎస్.సుజన, ఎంపీటీసీలు పి.కొండారెడ్డి, డేగా వంశీ, వై.భవాని, రొడ్డా కొండయ్య, సొసైటీ అధ్యక్షుడు ఎం.విజయకుమార్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు ఆర్.శ్రీనివాసులురెడ్డి, సీఎం ఓబుల్‌రెడ్డి, కాటం రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు ముమ్మరం

• ప్రత్యేక బృందాలతో రైళ్లలో సోదాలు
• నగదు, బంగారం, వెండి, మద్యం స్వాధీనం
• నెల్లూరు రైల్వే డీఎస్పీ విజయభాస్కర్‌రావు



మాట్లాడుతున్న విజయభాస్కర్‌రావు

నెల్లూరు(క్రైమ్): 'సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రైళ్లలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నాం. పొరుగు మద్యం, ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న బంగారు, వెండి ఆభరణాలతోపాటు నగదును సీజ్ చేస్తున్నాం. తదుపరి దర్యాప్తు నిమిత్తం ఆదాయపు పన్ను, జీఎస్టీ అధికారులకు అప్పగిస్తున్నాం' అని నెల్లూరు రైల్వే డీఎస్పీ సి.విజయభాస్కర్‌రావు తెలిపారు. గురువారం ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రైల్వే డీజీ కుమార్ విశ్వజిత్, గుంతకల్ రైల్వే ఎస్పీ కె.చౌడేశ్వరి ఆదేశాల మేరకు చీరాల నుంచి తడ, వెంకటగిరి వరకు రైళ్లలో విస్తృతంగా తనిఖీలు చేసేందుకు నెల్లూరు, ఒంగోలు సీఐలు కె.భుజంగరావు, ఎస్.శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. బృందాలు నెల్లూరు, ఒంగోలు మీదుగా రాకపోకలు సాగించే అన్నీ రైళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయన్నారు. జనవరి 22 నుంచి ఇప్పటి వరకు ఎలాంటి బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న రూ.87 లక్షలకు పైగా నగదు, సుమారు మూడు కేజీల బంగారు, 29 కేజీల వెండి ఆభరణాలు, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 274 మద్యం బాటిళ్లు, 13.785 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన నగదు, బంగారు, వెండి ఆభరణాలను ఇన్‌కమ్ ట్యాక్స్, జీఎస్టీ అధికారులకు అప్పగించామన్నారు. తనిఖీలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. అక్రమార్కులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వేసవి సమీపిస్తున్న దృష్ట్యా నేర నియంత్రణకు పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నట్లు వెల్లడించారు. నేరాలు జరిగేందుకు అవకాశమున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. స్థానిక పోలీసుల సహకారంతో ఆయా ప్రాంతాల్లో గస్తీని ముమ్మరం చేస్తామన్నారు. పాతనేరస్తులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెంచామన్నారు. రైళ్లలో బీట్లను పటిష్టం చేస్తున్నామని చెప్పారు. ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రయాణికులకు సూచించారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే గస్తీ విధుల్లో ఉన్న సిబ్బందికి సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు.